www.prajasakti.com

ప్రజాశక్తి

ఆదివారం 11 ఆగస్టు 2024

5

ఏలూరు



వయనాడ్ బాధితులకు విరాళాల సేకరణ

ప్రజాశక్తి - భీమడోలు

కేరళ రాష్ట్రంలో చోటు చేసుకున్న ప్రకృతి వైపరీత్యాల కారణంగా ఆ రాష్ట్ర ప్రజలకు అపార నష్టం కలిగిందని, ఈ మేరకు వారిని ఆదుకునేందుకు ప్రజలు విరివిగా విరాళాలు ఇవ్వాలని ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ కోరారు. విరాళాలు సేకరించే కార్యక్రమాన్ని శనివారం భీమడోలు జంక్షన్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేరళ రాష్ట్రంలోని వయనాడ్ జిల్లాలో కొండ చరియలు విరిగిపడటం, వరదల కారణంగా పలువురు చనిపోయారని, అపార నష్టం వాటిల్లిందని తెలిపారు. వారిని ఆదుకునేందుకు ఎపి రైతు సంఘం ఆధ్వర్యంలో విరాళాలు సేకరించే కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. విరాళాలు ఇచ్చిన దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కట్టా భాస్కరరావు, నాయకులు, కొర్ని అప్పారావు, కౌలు రైతు సంఘం జిల్లా నాయకులు వి.శ్రీరామచంద్రమూర్తి పాల్గొన్నారు.

500 బడుల్లో.. పదిలోపే విద్యార్థులు..!



ప్రాథమిక విద్యను నిర్వీర్యం చేసిన గత పాలకులు

117 జిఒ రద్దు చేయకుండా కూటమి ప్రభుత్వం ముందుకు

ఎన్నికల్లో ఇచ్చిన హామీకి తిలోదకాలిచ్చిన సర్కార్

గత ప్రభుత్వ జిఒ ఆధారంగా ఉపాధ్యాయుల సర్దుబాటుపై విమర్శలు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి


నూతన విద్యావిధానం ముసుగులో ప్రాథమిక విద్యను నిర్వీర్యం చేశారు. గత ప్రభుత్వం తెచ్చిన 117 జిఒతో ప్రాథమిక విద్య భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారింది. ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో 500 ప్రాథమిక పాఠశాలల్లో పదిలోపు విద్యార్థులే ఉన్నారంటే పరిస్థితి ఏమిటో అర్థం చేసుకోవచ్చు. ఈ పాఠశాలలను కొనసాగిస్తారా.. లేక మూసేస్తారా అనే ఆందోళన సర్వత్రా నెలకొంది. ప్రాథమిక విద్యను నిర్వీర్యం చేసిన 117 జిఒను రద్దు చేస్తామని హామీ ఇచ్చి అధికారంలోకొచ్చిన కూటమి సర్కార్ అందుకు విరుద్ధంగా ముందుకు సాగుతోంది. ఏలూరు జిల్లాలోని 27 మండలాల పరిధిలో 1400 ప్రాథమిక పాఠశాలలు ఉన్నాయి. వీటిలో 281 ప్రాథమిక పాఠశాలల్లో పది మందిలోపు విద్యార్థులే ఉన్నారు. ఏజెన్సీ ప్రాంతమైన బుట్టాయగూడెం మండలంలో 42 స్కూళ్లలో పదిలోపు విద్యార్థులు ఉండటం గమనార్హం. చాలా మండలాల్లో ఇదే పరిస్థితి నెలకొంది. చాలా స్కూళ్లలో ఆరేడుగురు విద్యార్థులున్న పరిస్థితి ఉంది. ముఖ్యంగా ఏజెన్సీలో ప్రాథమిక విద్య మరింత దెబ్బతింది. పశ్చిమగోదావరి జిల్లాలో 20 మండలాల పరిధిలో 959 ప్రాథమిక పాఠశాలలు ఉండగా 219 బడుల్లో పదిలోపే విద్యార్థులు ఉన్నారు. పోడూరు మండలంలో 18, భీమవరం మండలంలో 16 స్కూళ్లలో విద్యార్థుల సంఖ్య పదిలోపే ఉన్నారు. ఈ స్కూళ్లను మూసేస్తే ప్రాథమిక విద్య పూర్తిగా నిర్వీర్యమైపోనుంది. కేంద్రంలోని మోడీ సర్కార్ తెచ్చిన నూతన విద్యావిధానాన్ని గత వైసిపి ప్రభుత్వం అమల్లోకి తెచ్చింది. అందులో భాగంగా 117 జిఒను తీసుకొచ్చింది. 3, 4, 5 తరగతులను హైస్కూళ్లలో విలీనం చేసింది. దీంతో ప్రాథమిక స్కూళ్లలో ఒకటి, రెండు తరగతులు మాత్రమే మిగిలాయి. ప్రాథమిక స్కూళ్లలో అంగన్‌వాడీ (ప్రీ ప్రైమరీ-1, 2) పిల్లలను చేర్చుకోవాల్సి ఉంది. ఈ ప్రక్రియ ఎక్కడా జరగలేదు. దీంతో ఒకటి, రెండు తరగతులు మాత్రమే ఉండటంతో చాలా స్కూళ్లలో పదిలోపే విద్యార్థులు ఉన్నా రు. 3, 4, 5 తరగతులను దూరంగా ఉన్న హైస్కూళ్లలో విలీనం చేయడంతో చిన్న పిల్లలను అంతదూరం ఒంటరిగా పంపిం చలేక ఇంటి వద్దకు బస్సు వచ్చే ప్రయివేటు స్కూళ్లలో తల్లిదండ్రులు చేర్చిన పరిస్థితి ఉంది. దీంతో ప్రభుత్వ స్కూళ్లలో విద్యార్థుల సంఖ్య భారీగా తగ్గింది. ప్రభుత్వ స్కూళ్లను బలోపేతం చేసి విద్యార్థుల సంఖ్యను పెంచాల్సిన పాలకులు అందుకు విరుద్ధంగా వ్యవహారిం చడం కారణంగానే ఇటువంటి పరిస్థితి ఏర్పడిందనే విమర్శలు వెల్లువెత తున్నాయి. గత ప్రభుత్వం నాడు-నేడు పేరుతో స్కూళ్లలో మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నట్లు చెప్పినా ప్రభుత్వ విద్య బలోపేతానికి మాత్రం ఎటువం టి చర్యలూ తీసుకోలేదు. దీంతో ప్రాథమిక విద్య అస్తవ్యస్తమైంది.

మార్పుల్లేకుండా ఉపాధ్యాయుల సర్దుబాటు

ప్రాథమిక విద్యను బలోపేతం చేయాలంటే ముందుగా 117 జిఒను రద్దు చేయాలి. ఎన్నికల్లో తాము అధికారంలోకి వస్తే 117 జిఒ రద్దు చేస్తామని టిడిపి కూటమి హామీ ఇచ్చింది. జిఒను రద్దు చేయకుండా ఉపాధ్యాయుల సర్దుబాటుకు ప్రభుత్వం పూనుకుంది. జిఒ కారణంగా గతంలో 40 మంది విద్యార్థులకు ఉపాధ్యాయుడు ఉండాల్సి ఉండగా, ఆ సంఖ్య 60కి పెరిగింది. దీంతో ఉపాధ్యాయులు ఎక్కువగా ఉన్నారని డివిజన్ పరిధిలోని ఇతర స్కూళ్లకు బదిలీ చేస్తున్నారు. జిఒ 117 రద్దు చేస్తే ప్రస్తుతం ఉన్న ఉపాధ్యాయులు సరిపోరు. మరికొంత మందిని నియమించాల్సి ఉం టుంది. అంతేకాకుండా 3, 4, 5 తరగతులను తిరిగి ప్రాథమిక పాఠ శాలలకు పంపించాల్సి ఉంటుంది. ఉపాధ్యాయుల కొరత ఉంటే డిఎస్‌సి పూర్తయ్యే వరకూ తాత్కాలికంగా విద్యా వాలంటీర్లను నియమించి ముందుకు సాగాలి. జిఒను రద్దు చేసి ముందుకు సాగితే ప్రాథమిక విద్యతోపాటు హైస్కూల్ విద్య సైతం బలోపేతమవు తుంది. ప్రభుత్వం ఆ విధంగా ఆలోచించకుండా 117 జిఒ ఆధారం గానే ఉపాధ్యాయుల సర్దుబాటు చేపట్టింది. దీని వల్ల ప్రభుత్వ విద్య బలోపేతానికి ఎటువంటి ప్రయోజనమూ ఉండదనే చర్చ ఉపాధ్యాయ సంఘాల్లో నడుస్తోంది. ప్రభుత్వ విద్యను బలోపేతం చేసేవిధంగా చర్యలు చేపట్టాలని అంతా కోరుతున్నారు.

సమస్యలు పరిష్కరించండి

మంత్రి నిమ్మలకు సిపిఎం నేతల వినతి



మంత్రి నిమ్మలకు వినతిపత్రం అందిస్తున్న సిపిఎం నేతలు


ప్రజాశక్తి - పాలకొల్లు

ఉమ్మడి జిల్లాలో పలు సమస్యలు దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్నాయని, వీటి పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం చొరవ చూపాలని సిపిఎం నేతలు రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడుని కోరారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం, పశ్చిమగోదావరి జిల్లా కార్యదర్శి బి.బలరాం, ఏలూరు జిల్లా కార్యదర్శి ఎ.రవి, ఇతర నేతలతో కూడిన బృందం శనివారం మంత్రి క్యాంపు కార్యాలయంలో కలిసి వినతిపత్రం సమర్పించింది. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ రైతులకు ధాన్యం బకాయిల సొమ్ము వెంటనే వడ్డీతో సహా చెల్లించాలని కోరారు. ఎన్నికల్లో హామీ ఇచ్చిన విధంగా వ్యవసాయానికి మీటర్లు పెట్టే ఆలోచన ఉపసంహరించుకోవాలని కోరారు. కౌలురైతు లకు గుర్తింపు కార్డులిచ్చి రుణాలు అందించాలని, భూయజమానితో నిమిత్తం లేకుండా గుర్తింపు కార్డు లిచ్చేలా చట్టాన్ని సవరించాలని, వర్షాలకు నష్టపోయిన రైతులకు నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని కోరారు. వరదలు, వర్షాల రీత్యా మురుగు సాఫీగా పోయేలా యుద్ధప్రాతిపదికన డ్రెయిన్లలో చెత్త, చెదారం, తూడు తొలగించి బాగు చేయించాలని విజ్ఞప్తి చేశారు. నివాస ప్రాంతాల్లో, కాలనీల్లో ముంపు, మురుగు లేకుండా చూడాలని, వ్యాధులు రాకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని కోరారు. జ్వరాలతో సహా అన్నివ్యాధులు ఆరోగ్యశ్రీలోకి తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర రహదారులపై టోల్‌ట్యాక్స్ ఆలోచన విరమించుకోవాలని, రోడ్ల మరమ్మతులు చేయించి ప్రమాదాలు నివారించాలని కోరారు. చించినాడలో గోదావరి లంక భూములకు పేదలకు పట్టాలు ఇవ్వాలని, గత ప్రభుత్వం పెట్టిన అక్రమ కేసులు ఎత్తివేయాలని, తుందుర్రు ఉద్యమ అక్రమ కేసులు కూడా ఎత్తివేయాలని కోరారు. జిల్లాలో మూతపడిన పరిశ్రమలు ఆంధ్రా సుగర్స్, డెల్టా పేపర్ మిల్స్, తణుకులో స్పిన్నింగ్ మిల్స్, ఏలూరులో జ్యూట్‌మిల్లులు తెరిపించి కార్మికులకు ఉపాధి కల్పించాలని, వ్యవసాయ, గ్యాస్ ఆధార పరిశ్రమలు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. గ్రామాల్లో దళితుల శ్మశానవాటికల సమస్యలు పరిష్కరించాలన్నారు. అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందేలా చూడాలని, స్కీమ్ వర్కర్లు, వాలంటీర్ల సమస్యలు పరిష్కరించాలని కోరారు. జిల్లాలో కాలుష్య నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని, కాలుష్యం కారణంగా వ్యాధులు విజృంభిస్తున్నాయని తెలిపారు. జిల్లాలోని ఆసుపత్రుల్లో అవసరమైన సిబ్బంది నియామకంతోపాటు పరికరాలు, సౌకర్యాలు కల్పించాలని కోరారు. ఇళ్ల కాలనీలు, టిడ్కో ఇళ్ల వద్ద మౌలిక వసతులు కల్పించాలని, లబ్ధిదారులకు ఇళ్లు స్వాధీనం చేయాలని విజ్ఞప్తి చేశారు. లబ్ధిదారులు అప్పుల పాలుకాకుండా ప్రభుత్వమే ఉచితంగా ఇళ్లు నిర్మించి ఇవ్వాలని సూచించారు. కార్పొరేట్ స్కూళ్లు, కాలేజీల్లో ఫీజుల దోపిడీ అరికట్టాలని, ప్రభుత్వ నిబంధనలు అమలయ్యేలా చూడాలని కోరారు. నిత్యావసరాల ధరల అదుపునకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ప్రజాపంపిణీ వ్యవస్థలో సరుకులు పెంచాలని కోరారు. మంత్రిని కలిసిన వారిలో మాజీ ఎంఎల్ఎ దిగుపాటి రాజగోపాల్, నేతలు జెఎన్‌వి.గోపాలన్, కవురు పెద్దిరాజు, పివి.ప్రతాప్, కర్రి నాగేశ్వరరావు, జుత్తిగ నరసింహమూర్తి, వై.నాగేంద్రరావు, వై.సాయికిరణ్, ఎం.జీవరత్నం, జవ్వాది శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పెద్ద పాలేరులా పని చేస్తా

నూజివీడు నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయం


మంత్రి కొలుసు పార్థసారధి



వాటర్ ప్లాంట్ ప్రారంభిస్తున్న మంత్రి పార్థసారధి

ప్రజాశక్తి - ముసునూరు

నూజివీడు నియోజకవర్గ అభివృద్ధికి పెద్ద పాలేరుగా పని చేస్తానని రాష్ట్ర సమాచార, పౌర సంబంధాలు, గృహనిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారధి అన్నారు. శనివారం ముసునూరు మండలం గోపవరం గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్మించిన మినరల్ వాటర్ ప్లాంట్‌ను ఆయన ప్రారంభించారు. గతంలో నిర్మించిన మినరల్ వాటర్ ప్లాంట్ నిరుపయోగంగా పనికిరాని స్థితిలో ఉండటంతో అదే గ్రామానికి చెందిన ఎన్ఆర్ఐ కె.శివ రూ.60 వేల ఆర్థిక సాయంతో మరమ్మతులు చేపట్టారు. ఈ ప్లాంట్‌ను ప్రారంభించిన అనంతరం మంత్రి పార్థసారధి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల భవిష్యత్తు కోసం ఎన్నో వేలకోట్లు ఖర్చు చేస్తుందన్నారు. దీన్ని ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. తాను ఈ నియోజకవర్గానికి పెద్ద పాలేరులా పని చేస్తానని, ఏ కష్టమొచ్చినా తన దృష్టికి తీసుకొస్తే తక్షణమే పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని తెలిపారు. నియోజకవర్గంలోని అన్ని రోడ్ల పనులు త్వరలో చేపడతామన్నారు. ఇల్లు కట్టుకునే ప్రతి ఒక్కరికీ రూ.4.30 లక్షలు ఆర్థిక సాయం అందించనున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, నేతలు పాల్గొన్నారు. బలివే గ్రామంలో శ్రీ రామలింగేశ్వరస్వామి ఆలయం వద్ద తమ్మిలేరుపై వంతెన నిర్మాణ పనులు పరిశీలించి పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో నూజివీడు ఆర్‌డిఒ వై.భవానిశంకరి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న మంత్రి పార్థసారధి

కోర్టు మానిటరింగ్ సిస్టం ఏర్పాటు

ఎస్‌పి ప్రతాప్‌శివకిషోర్

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

జిల్లాలో కోర్టు మానిటరింగ్ సిస్టంను ఏర్పాటు చేస్తున్నామని, దీనిద్వారా పెండింగ్ కేసుల వివరాలు స్పష్టంగా అందరికీ తెలుస్తాయని ఎస్‌పి ప్రతాప్‌శివకిషోర్ తెలిపారు. ఏలూరు నగరంలోని జిల్లా పోలీస్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో జిల్లా వ్యాప్తంగా ఉన్న కోర్ట్ కానిస్టేబుల్స్‌తో ఆయన శనివారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. కోర్ట్ కానిస్టేబుల్స్‌కు ఆయన ప్రత్యేక సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కోర్టు మానిటరింగ్ సిస్టం ద్వారా కోర్టులో పెండింగ్‌లో ఉన్న అన్ని కేసుల వివరాలను ఎప్పటికప్పుడు తెలుసుకోవచ్చన్నారు. అలాగే కోర్టు కానిస్టేబుల్స్ ఛార్జిషీటు దాఖలు చేసిన అనంతరం నిందితులకు శిక్షలు పడేందుకు కావాల్సిన సాక్షులను ప్రవేశపట్టడంలో కీలకపాత్ర వహించాలన్నారు. ఈ శిక్షలు పడడానికి కోర్టు మానిటరింగ్ సిస్టం కూడా దోహదపడుతుందన్నారు. ఉద్యోగ నిర్వహణలో ప్రతిభ కనబరిచే ప్రతి ఒక్క కానిస్టేబుల్‌కు నగదు పురస్కారం అందించనున్నామని చెప్పారు. విధుల్లో అలసత్వం వహించినవారిపై కఠిన చర్యలు తీసుకునేందుకు కూడా రంగం సిద్ధం చేశామని తెలిపారు.

పట్టేద్దాం... నామినేటెడ్ పదవి

ఎఎంసి ఛైర్మన్ పైనే ప్రధాన దృష్టి

అంచనాల్లో ఆశావహులు

ప్రజాశక్తి - ఉంగుటూరు

నామినేటెడ్ పదవుల కోసం నేతల ఎదురు చూస్తున్నారు. తాజాగా ప్రభుత్వం కూడా పది రోజుల్లో పార్టీకోసం కష్టపడిన వారికే నామినేటెడ్ పదవులు ఇస్తున్నట్లు ప్రకటించడం ఆశావాహుల్లో తీవ్ర ఉత్కంఠ నెలకొంది. ముఖ్యంగా వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ పదవుల కోసం నేతలు దరఖాస్తులు కూడా చేసుకున్నారు. ఎన్నికల్లో టిడిపి కూటమి ఘన విజయం సాధించిన నేపథ్యంలో నామినేటెడ్ పదవుల భర్తీకి రంగం సిద్ధమవుతోంది. నియోజకవర్గ స్థాయి, నేరుగా రైతులతో సత్సంబంధాలు ఉన్న పదవి కావడంతో ఎఎంసి ఛైర్మన్ పదవి రాజకీయంగా జనంలో పరపతి మరింత పెంచుతుందని నేతలు ఆశ పడుతున్నారు. నియోజకవర్గంలోని కీలక నాయకులు తమ మనసులోని మాటను ఇప్పటికే పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఎంఎల్ఎల వద్ద ప్రస్తావించారు. ఇతర నాయకులు డైరెక్టర్ పదవుల కోసం చూస్తున్నారు. ఈ పదవుల్లో సగం మహిళలకు రిజర్వు అయ్యే అవకాశం ఉన్నట్లు చెబుతున్నారు.

మార్కెట్ కమిటీ పాలకవర్గం కూర్పు ఇలా

ఇప్పటివరకూ కొనసాగిన నిబంధన ప్రకారం వ్యవసాయ మార్కెట్ కమిటీ (ఎఎంసి)లకు ఎంఎల్ఎ గౌరవ అధ్యక్షునిగా వ్యవహరించేవారు. ఉంగుటూరు మార్కెట్ కమిటీ పాలక వర్గంలో గౌరవ అధ్యక్షుడు ఎంఎల్ఎతో పాటు ఛైర్మన్‌తో కలిపి మొత్తం 20 మందికి పాలకవర్గంలో చోటు ఉండనుంది. ఇందులో 12 మంది రైతులు, ముగ్గురు వర్తకుల (ఎఎంసి నుంచి లైసెన్సు పొందిన వారు), మార్కెటింగ్ శాఖ సహాయ సంచాలకుడు, సంబంధిత పిఎసిఎస్ అధ్యక్షుడు, సర్పంచి, ప్రత్యేకాధికారి, వ్యవసాయ, పశుసంవర్ధక శాఖ ఏడీల్లో ఒకరిని పాలకవర్గంలో నియమించాల్సి ఉంటుంది.



ఉంగుటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయం

రిజర్వేషన్లే కీలకం కానున్నాయా

ఎఎంసి అధ్యక్ష పీఠాలను రిజర్వేషన్ ప్రాతిపదికగా భర్తీ చేసేలా గతం నుంచి అమలు చేస్తున్నారు. టిడిపి కూటమి ప్రభుత్వం ఏ మేరకు నిబంధనలు విధించి ఒసి, బిసి, ఎస్‌సి, ఎస్‌టి మైనార్టీలకు కేటాయిస్తారో వేచిచూడాల్సి ఉంది. ఉంగుటూరు నియోజకవర్గంలో భీమడోలు, ఉంగుటూరు మార్కెట్ కమిటీలున్నాయి.

పోటా పోటీగా ఆశావాహులు దరఖాస్తులు అందజేత

ఎఎంసి ఛైర్మన్ కిరీటం కోసం ఎన్నికల ఫలితాలు వచ్చిన కొన్నిరోజుల నుంచే నాయకుల మధ్య విపరీతమైన పోటీ నెలకొంది. రిజర్వేషన్ల ప్రకారం నేతలకు పదవులు దక్కకపోతే తమ భార్యలకు, కుటుంబ సభ్యుల్లో మహిళలకు ఇవ్వాలని కోరేందుకు సైతం ప్రతిపాదనలు సిద్ధం చేసుకున్నట్లు సమాచారం. రిజర్వేషన్లు అడ్డంకిగా మారితే తమ అనుచరుల కోసం గట్టిగా పట్టుబట్టే అవకాశాలు సైతం లేకపోలేదు అన్నట్లు ప్రచారం జరుగుతోంది. ఉమ్మడి జిల్లాలో 18 మార్కెట్ కమిటీలకు సైతం డిమాండ్ ఉంటుందని సంబంధిత వర్గాలు అంచనా వేస్తున్నాయి.

ఉంగుటూరు ఎఎంసి కోసం గట్టి పోటీ

ఉంగుటూరు ఎంఎల్ఎగా జనసేన నేత పత్సమట్ల ధర్మరాజు ఉన్నారు. మొదటి నుంచి టిడిపికి పట్టు ఉన్న నియోజకవర్గం కావడంతో టిడిపి నాయకులు ఎఎంసి ఛైర్మన్ పదవి కోసం ఎవరి ప్రయత్నాల్లో వారు నిమగ్నమయ్యారు. ఉంగుటూరు మండలం నుంచే ఈ పదవికి ఏడుగురు పోటీ పడుతున్నట్లు తెలిసింది. దరఖాస్తులు చేసుకున్న వారిలో ఆరుగురు ఒసిలు కాగా ఎస్‌సి ఒక్కరే. వీరిలో టిడిపి బలోపేతానికి కృషి చేసిన వారి వివరాలను ఇప్పటికే అనేక మార్గాల ద్వారా అధిష్ఠానం నివేదికలు రాబట్టుకుందని, వాటిని విశ్లేషించి సర్వే మేరకే కష్టపడి, అన్ని తరగతుల వారికి అందుబాటులో ఉండే నాయకుడికే ఎఎంసి ఖరారు కానున్నట్లు ప్రచారం సాగుతోంది. గతంలో పదవి చేపట్టిన వారు సైతం రేసులో ఉన్నట్టు తెలిసింది. అయితే నియోజకవర్గంలో రెండు ఎఎంసిల్లో చెరోకటి జనసేన, టిడిపి నేతలకు కేటాయించే అవకాశాలు ఉన్నాయి.

చింతలపూడి-టి.నర్సాపురం రోడ్డు వేయరూ

జెసికి పలువురి వినతి



జెసికి మొక్క అందిస్తున్న నాసర్‌పాషా, సత్తిబాబు

ప్రజాశక్తి - టి.నరసాపురం

ప్రమాదభరితంగా తయారైన చింతలపూడి-టి.నర్సాపురం ప్రధాన రహదారిని తక్షణం అభివృద్ధి చేయాలని, మండలంలోని ఇతర సమస్యలు పరిష్కరించాలని కోరుతూ టి.నర్సాపురానికి చెందిన సామాజిక కార్యకర్త ఎస్‌డి.నాసర్‌పాషా, జనసేన నాయకులు పాలేటి సత్తిబాబు శనివారం ఏలూరులో జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డిని కలిసి వినతిపత్రం అందజేసినట్లు స్థానిక విలేకరులకు తెలిపారు. తొలుత నూతన జెసికి మొక్క అందజేసి శుభాకాంక్షలు తెలిపామన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టి.నర్సాపురం నుండి చింతలపూడి వరకు ప్రధాన రహదారి వాహనదారుల పాలిట ప్రమాదభరితంగా తయారైందన్నారు. దీంతో ఈ మార్గంలో పది కిలోమీటర్లు ప్రయాణించలేక తెడ్లం, ప్రగడవరం మీదుగా చింతలపూడి చుట్టుతిరిగి వెళ్లాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలోని గండిగూడెం, మక్కినవారిగూడెం-జీలుగుమిల్లి, బండివారిగూడెం తదితర ప్రధాన రోడ్లకు తక్షణం మరమ్మతులుచేయాలని, మండల పరిధిలోని అంతర్గత రోడ్ల అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని, టి.నర్సాపురంలో డ్రెయినేజీ పనులు పూర్తి చేయాలని, గుర్రాజు గుంట వద్ద చింతలపూడి పంచాయతీ చెత్త డంపింగ్ నిలిపివేయాలని కోరారు. ఎర్ర చెరువు ప్రాంతం ముంపు నివారణకు చర్యలు చేపట్టాలన్నారు. స్థానిక ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రంలో మెరుగైన వైద్యం అందించాలని, అన్నివేళలా వైద్యసిబ్బంది అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. వారివెంట సామాజిక కార్యకర్త జమీల బేగం ఉన్నారు.

తాడిపూడి కాల్వల పనులు పూర్తి చేయాలి

రైతుల భూములకు సాగునీరందించాలి - తాడిపూడి ఆయకట్టు రైతుల సమావేశం

ప్రజాశక్తి - ద్వారకాతిరుమల

తాడిపూడి ఎత్తిపోతల పథకం కాల్వల పనులు వెంటనే పూర్తి చేయాలని, అందుకు రాష్ట్ర ప్రభుత్వం నిధులు కేటాయించాలని ఎపి రైతుసంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ కోరారు. శనివారం ఎం.నాగులపల్లి పాల ఉత్పత్తిదారుల సహకార సంఘం ఆవరణలో తాడిపూడి ఎత్తిపోతల పథకం ఆయకట్టు రైతుల సమావేశం నిర్వహించారు. సమావేశానికి గారపాటి చంద్రరావు అధ్యక్షత వహించారు. సమావేశంలో రైతుల సమస్యలు చర్చించి తీర్మానాలు ఆమోదించారు. ముఖ్యఅతిథి శ్రీనివాస్ మాట్లాడుతూ ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని రెండు లక్షల ఎకరాలకు సాగునీరందించే తాడిపూడి ఎత్తిపోతల పథకం పనులు పూర్తి చేయకపోవడం వల్ల రైతులు నానా ఇబ్బందులు పడుతున్నారన్నారు. భూగర్భ జలాలు అడుగంటి బోర్లు సక్రమంగా పని చేయక అనేక సందర్భాల్లో సాగునీరు అందక పంటలు ఎండిపోయే పరిస్థితి ఏర్పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ద్వారకాతిరుమల, దెందులూరు మండలాల్లో వేలాది ఎకరాలకు తాడిపూడి ఎత్తిపోతల పథకం ద్వారా సాగునీరందించే అవకాశమున్నా నిధుల కేటాయిం చకపోవడం వల్ల కాల్వల పనులు పూర్తి కాలేదన్నారు. రైతుల నుండి భూసేకరణ చేసి అరకొరగా కాలువలు తవ్వి వదిలేయడం వల్ల జంగిల్ పెరిగిందని, కాల్వ పూడిపోయిందని చెప్పారు. తాడిపూడి ఎత్తిపోతల పథకం పేరుతో భూసేకరణ చేసి కొంతమంది రైతులకు పరిహారం కూడా ఇవ్వలేద న్నారు. సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కట్టా భాస్కర రావు, మండల అధ్యక్షులు బోయపాటి సత్యనారాయణ మాట్లాడుతూ తాడిపూడి కాల్వల పనులు పూర్తయితే భూములకు సాగునీరందడమే కాకుండా చెరువులు నింపుకోవడానికి అవకాశం ఉంటుందన్నారు. ఈ నెల 12న ఏలూరు కలెక్టరేట్‌లో జరిగే మీకోసం కార్యక్రమంలో కలెక్టర్‌కు ఆయకట్టు రైతులతో సామూహిక రాయబార కార్యక్రమం నిర్వహిం చనున్న ట్లు తెలిపారు. సమావేశంలో వీరవల్లి సత్యనారాయణ, గోవాడ గోపాలం, గుర్రం రాంబాబు, ఈడే మురళీకృష్ణ, పోలు కొండ నాగరాజు, ఎంట్రపాటి రాజు, మద్ది రాముడు, చల్లగాలి వీరభద్రం, వై.త్రిమూర్తులు, గారపాటి సత్యనారాయణ, ఆయకట్టు రైతులు పాల్గొన్నారు.

ఆవేదన.. ఆక్రందన..!

పాలకుల నిర్లక్ష్యం.. వ్యవస్థల వైఫల్యం వెరసి జిల్లాలో చోటుచేసుకున్న పరిణామాలతో వివిధ తరగతుల ప్రజానీకం ఆవేదనకు గురవ్వడంతోపాటు ఆక్రందనలు చేసే పరిస్థితి. ఆయా సందర్భాల్లో హడావుడి చేస్తున్న అధికారులు, పాలకులు శాశ్వత చర్యలపై దృష్టి పెట్టేదెప్పుడో.. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చూసెదెన్నడో అనే చర్చ రెండు జిల్లాల్లో పెద్దఎత్తున సాగుతోంది.

కృష్ణా డెల్టా ఆయకట్టు రైతులు సాగునీటి కోసం రోడ్డెక్కడం అందరినీ ఆశ్చర్యానికి గురిచేస్తోంది. ఓపక్క వర్షాలు.. మరోపక్క గోదావరి, కృష్ణా నదులకు వరదలు వెరసి పశ్చిమడెల్టా ముంపుబారిన పడుతుంటే కృష్ణా డెల్టా ఆయకట్టు రైతులు సాగునీటి కోసం ఆందోళనలు చేస్తుండటం చర్చనీయాంశమైంది. పాలకులు, అధికారుల నిర్లక్ష్యంపై రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షాలు కురిసి పంటలు మునిగిన సందర్భంలో.. కాల్వల ద్వారా నీటి ప్రవాహం సాగక భూములు బీడువారినప్పుడు అధికారులు హడావుడిగా కాల్వల్లో పేరుకుపోయిన చెత్త, తూడు, గుర్రపుడెక్క తొలగిస్తున్నారు. నష్టం జరిగాక, రైతులు రోడ్డెక్కాక అధికారులు స్పందించడంతో అప్పటికే రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారు. ప్రకృతి సహకరించినా ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల తాము సకాలంలో సాగు చేయలేకపోతున్నామని, చేసినా ఆయా పంటలు ఎండిపోకుండా రక్షించలేకపోతున్నామని కృష్ణా ఆయకట్టు రైతులు ఆవేదన చెందుతున్నారు.

చిన్నారులపై లైంగిక దాడులు నివ్వెరపరుస్తున్నాయి. కుక్కునూరు, ఆకివీడు ఘటనలు మరువక ముందే నూజివీడు మండలంలో చిన్నారిపై లైంగిక దాడి సంచలనం సృష్టించింది. అందరినీ కలిచివేసింది. ఇంటి వద్దే ఆరుబయట నానమ్మ ఒడిలో నిద్రిస్తున్న బాలిక (4)ను అపహరించి అఘాయిత్యానికి పాల్పడటం ఇక చిన్నారులకు రక్షణ ఎక్కడనే చర్చ సాగుతోంది. నిందితుడు గతంలో ఓ బాలికపై అత్యాచారానికి పాల్పడి జైలుకెళ్లి బెయిల్‌పై వచ్చినట్లుగా పోలీసులు గుర్తించడం అందరినీ విస్మయపర్చింది. అంటే కేసు, జైలు, శిక్ష అనేవి ఆ ప్రబుద్ధునిలో ఎటువంటి మార్పు కల్గించకపోగా మరింత తెగింపుతో నిద్రిస్తున్న బాలికను ఎత్తుకెళ్లి మరీ అత్యాచారానికి పాల్పడ్డాడంటే వ్యవస్థల వైఫల్యం ఏస్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. దీనికి ముందు కుక్కునూరు మండలంలో తెలిసిన వ్యక్తే బాలికకు మాయమాటలు చెప్పి నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లి అత్యాచారానికి పాల్పడగా ఆకివీడులో లిఫ్ట్ అడిగిన బాలికపై యువకులు అత్యాచారానికి పాల్పడ్డారు. ఓపక్క మహిళలపై అత్యాచారాలు, అకృత్యాలు పెరిగిపోయాయని ఆందోళన చెందుతుండగా మరోపక్క ముక్కుపచ్చలారని బాలికలపైనా కామాంధులు అఘాయిత్యాలకు పాల్పడటంతో సర్వత్రా ఆందోళన నెలకొంది. ఇప్పటికైనా పాలకులు చట్టాలు చేసి చేతులు దులుపుకోవడం కాకుండా అఘాయిత్యాలకు కారణమవుతున్న, ప్రేరేపిస్తున్న అంశాలు గుర్తించి వాటి నిర్మూలనపై దృష్టి సారిస్తే ఫలితం ఉంటుందనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది. ఈలోపు ఇటువంటి ఘటనలు జరిగినప్పుడు త్వరితగతిన విచారణ పూర్తి చేసి కఠిన శిక్షలు విధించేలా చూడాల్సిన బాధ్యత పోలీసుశాఖపైనా ఉంది.

ఇక టి.నర్సాపురంలో తెల్లవారుజామున ప్రభుత్వ దవాఖానాకు అత్యవసర వైద్యం కోసం వెళ్తే గేట్లు వేసి ఉండటంతోపాటు ఆపై వైద్యులు అందుబాటులో లేకపోవడం..



ఫలితంగా ఓ బాలింత కన్నుమూయడం బాధాకరం. రోజుల వయస్సులోనే తల్లిని కోల్పోయిన ఆ పసికందు జీవితాంతం ఆ లోటును భరించాల్సిందే. స్టాఫ్ నర్సు మాత్రమే ఆసుపత్రిలో ఉండగా అక్కడ వైద్యం అందించడానికి మీనమేషాలు లెక్కించారని బాలింత బంధువులు ఆరోపిస్తున్నారు. పైగా ఆ సమయంలో విధుల్లో ఉండాల్సిన డాక్టర్ ఎక్కడున్నారనేది ఉన్నతాధికారులే చెప్పాలి. పైగా వైద్యం అందించే ప్రయత్నం చేస్తుంటే బంధువులే బాలింతను తీసుకెళ్లిపోయారని ఆరోపించడం అత్యంత అమానుషం. అసలు బాలింతకు వచ్చిన సమస్య ఏమిటీ, దానికి సంబంధించిన వైద్యం చేసే అవకాశం అక్కడి ఆసుపత్రిలో ఉందా లేదా అనేది అక్కడి వైద్యురాలు చెబితే బాగుండేది. అలాకాకుండా మృతురాలి బంధువులపై నెపం వేసే ప్రయత్నం చేయడం తప్పించుకునే ప్రయత్నమేనని స్పష్టమవుతోంది. గేటు తెరిచే వరకూ అరగంట వరకూ వేచి ఉన్న బంధువులు మరో గంట వేచి ఉండలేరా అనే అంశం దగ్గర నుంచి పరిశీలిస్తే వాస్తవాలు వెలుగుచూసే అవకాశం ఉంది. బాలింతకు సకాలంలో వైద్యం అందక పరిస్థితి విషమించడం, దీంతో చికిత్స చేసేందుకు స్టాఫ్ నర్సు వెనుకాడటం, పైగా వైద్యులు అందుబాటులో లేకపోవడం వల్లే ఈ ఘోరం చోటుచేసుకుందని తెలుస్తోంది. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారించి పిహెచ్‌సిల్లో వైద్యసౌకర్యాలు మెరుగుపర్చడంతోపాటు వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉండేలా చూడాలని జనం కోరుతున్నారు.

-విఎస్ఎస్‌వి.ప్రసాద్

'దళిత క్రైస్తవులను దళిత ఎస్‌సిలుగా గుర్తించాలి'

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

దళిత క్రైస్తవులను దళిత ఎస్‌సిలుగా గుర్తించి రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేస్తూ ఏలూరు నగర దళిత క్రైస్తవ సంఘాలు శనివారం నగరంలో ర్యాలీ నిర్వహించాయి. గ్జేవిఆర్ నగర్‌లో ప్రారంభమైన ర్యాలీ ఏలూరు కలెక్టరేట్‌కు చేరుకుంది. అక్కడ కొద్దిసేపు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భం గా ఏలూరు జిల్లా దళిత క్రైస్తవ సంఘాల నాయకులు ఫాదర్ తోట ఆంటోనీ రాజు, ఫాదర్ జి.మోజెస్, ఫాదర్ మైఖేల్ తదితరులు మాట్లాడుతూ గత 74 ఏళ్లుగా ప్రతియేటా ఆగస్టు 10న దళిత రిజర్వేషన్ల కోసం పోరాటం సాగిస్తున్నామన్నారు. కేంద్ర ప్రభుత్వం దళిత క్రైస్తవులకు రాజ్యాంగబద్ధంగా అందాల్సిన రిజర్వేషన్ ఫలాలు అందనీయకుండా పక్షపాత వైఖరితో అడ్డుపడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.

మహిళలకు రక్షణేది..!

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

మహిళలపై సైబరింతో కూడిన దాడులు జరుగుతున్న నేపథ్యంలో ముందుగానే మేల్కొని తగు చర్యలు తీసుకోవాలని విద్యార్థి నాయకులు సూచిస్తున్నారు. మండలంలోని పరింపూడి పంచాయతీ పరిధిలో ఎంపిడిఒ, ఎంఇఒ, పంచాయతీ రాజ్, పశువుల ఆసుపత్రి దారి గుండా వెళ్లే మహిళలకు ఆకతాయిలు నుంచి వేధింపులు ఎదురవుతున్నాయి. ఐసిడిఎస్, పశువుల ఆసుపత్రి రోడ్డులో బిసి, ఎస్‌సి లేడీస్ హాస్టల్ నుంచి ఇతర చోట్ల ఉన్న కాలేజీలకు, పాఠశాలలకు వెళ్లే విద్యార్థినులపై కొందరు అసభ్యకరంగా మాట్లాడుతున్నారని వారు వాపోతున్నారు. తాము పోలీసులకు చెబితే ఎలాంటి పరిణామాలు ఉంటాయో తెలియక ఫిర్యాదు చేయడానికి విద్యార్థినులు జంకుతున్నారు. విషయం తెలుసుకున్న ఎస్‌ఎఫ్ఐ వారు పోలీసులను సంప్రదించారు. అక్కడ ఎవరూ స్పందించకపోవడంతో గతంలో పోలవరం డిఎస్‌పిని సంప్రదించడంతో ఎలాంటి చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. ప్రస్తుతం ఉన్న ఎస్ఐ లీవ్‌లో ఉన్నారు. కొత్త ఎస్ఐ రావడానికి ఇంకా సమయం పడుతుందని కానిస్టేబుల్ చెబుతున్నారు. పోలవరం డిఎస్‌పిని సంప్రదించినా ఎలాంటి చర్యలు తీసుకోలేదని, ప్రజా ప్రతినిధులకు చెప్పినా లాభం లేకపోవడంతో జిల్లా ఎస్‌పికి ఫిర్యాదు చేస్తామని ఎస్ఎఫ్ఐ నాయకులు తెలిపారు.

ఆక్వారంగాన్ని మోడల్‌గా తీర్చిదిద్దాలి

ఆక్వా హబ్‌ను పరిశీలించిన జాతీయ బృందం

ప్రజాశక్తి - కలిదిండి



ఆక్వా హబ్ పరిశీలిస్తున్న బృందం

స్థానిక ఆక్వా హబ్‌ను ఆక్వా కల్చర్ జాతీయ బృందం సందర్శించి పరిశీలించారు. అసిస్టెంట్ ఎఫ్ఎఒ రిప్రజెంటేటివ్, డాక్టర్ కొండా చావ్వా నేషనల్ బయోడైవర్సిటీ ఎక్స్ పర్ట్ నేషనల్ ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ సీమా బల్, లీడ్ టెక్నికల్ స్పెషలిస్ట్ మురళీధరన్, ఆక్వా కల్చర్ స్పెషలిస్ట్ విష్ణు భట్, ప్రయివేట్ సెక్టార్ వాల్యూ చైన్ సస్టైనబుల్ ఫైనాన్స్ స్పెషలిస్ట్ నీలికంఠ మిత్రా, ఇన్విరాన్మెంటల్ మేనేజ్‌మెంట్ స్పెషలిస్ట్ నీనా కోషి, జెండర్ స్టేక్ హోల్డర్స్ ఎంగేజ్‌మెంట్ సేఫ్ గార్డ్స్ స్పెషలిస్ట్ సలోమి ఏసుదాస్‌లు ఆక్వా హబ్ అధినేత హబీబుల్లా ఖాన్ చేపల చెరువు విస్తీర్ణం, చేపలు వేసే సంఖ్య అవి పెంచే కాల పరిమితిని వివరించారు. అనంతరం ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్‌ను పరిశీలించారు. ఆంధ్రప్రదేశ్ ఆక్వా హబ్‌గా ఉన్నందున ఆరోగ్య ఆక్వాగా, ప్రాజెక్టు వారీగా గుర్తిస్తూ, ఆక్వా రంగాన్ని మోడల్‌గా డెవలప్ చేయాల్సి ఉన్నందున పర్యావరణానికి హాని కలగని రీతిలో కల్చర్ కొనసాగించేందుకు చిన్న చిన్న మార్పులు చేపట్టాల్సి ఉంటుందని ఢిల్లీ లీడ్ టెక్నికల్ స్పెషలిస్ట్ మురళీధరన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డిఒ ఎన్ఎస్‌కె.ఖాజావలి, ఫిషరీస్ డిడి కెఎస్‌వి.నాగలింగాచార్యులు, కైకలూరు, బాదంపూడి ఎడిలు బి.రాజ్‌కుమార్, నరసయ్య, ఫిషరీస్ అడిషనల్ డైరెక్టర్ ఎస్.అంజలి, ఎఫ్‌డిఒ టి.రవికుమార్, తహశీల్దార్ ఎల్‌విఎస్.రామకృష్ణ, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

విఆర్‌ఒపై ఆరోపణలు అసత్యాలు

డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు సూర్యకిరణ్

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం టౌన్

మండలంలోని మైసన్నగూడెం గ్రామంలో 120/2 సర్వే నెంబర్ భూ విషయంపై విఆర్ఒ, విఆర్‌ఎలపై చేస్తున్న ఆరోపణలు అవాస్తవమని డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు సూర్యకిరణ్ అన్నారు. ప్రభుత్వం చేపట్టిన నవరత్నాల్లో భాగంగా ఇళ్ల స్థలాల కేటాయింపుల్లో భాగంగా తాము సాగులో ఉన్న 120/2 సర్వే నెంబర్‌లో ప్రభుత్వ భూమి 29 ఎకరాల 70 సెంట్లు ఉంది. ఆ భూమిలో ఎకరం 55 సెంట్లు భూమికి గ్రామంలో ఉన్న ప్రజలు ప్రపోజల్ పెట్టుకోగా పంచాయతీ తీర్మానం, అసైన్మెంట్ కమిటీ ఆమోదంతో ప్రభుత్వ భూ పంపిణీలో భాగంగా ప్రభుత్వం లబ్ధిదారులకు భూమిని ఇచ్చింది. అంతకాని అధికారులపై వస్తున్న ఆరోపణలను అవాస్తవాలని, ఉన్నతాధికారులు పరిశీలించాలని కోరారు. మైసన్నగూడెం గ్రామంలో కొందరు ఒసి బిసి తరగతులకు చెందిన రాజకీయ నాయకులు వారు దోచుకున్న రూ.లక్షల ప్రభుత్వ ధనం, కబ్జా చేసిన ప్రభుత్వ భూములు అక్రమంగా కలుపుకున్న పుంత భూములను కప్పి పుచ్చేందుకు ఇలాంటి అసత్యాల ప్రచారాన్ని చేస్తున్నారన్నారు. ఇటువంటి ఆరోపణలపై ఉన్నతాధికారులు విచారణ చేపట్టి నిజ నిర్ధారణ క్షుణ్ణంగా పరిశీలించాలని, అప్పటివరకు అబద్ధాల ఆరోపణలకు అధికారులపై ఎటువంటి చర్యలు తీసుకోవద్దని తహశీల్దార్, రెవెన్యూ డివిజనల్ అధికారి, కలెక్టర్‌ను కోరుతున్నామన్నారు.

ముంపు ప్రాంతాల్లో పారిశుధ్య పనులు

ప్రజాశక్తి - పోలవరం

ఇటీవల కురిసిన భారీ వర్షాలకు గూటాల గ్రామపంచాయతీ, కొత్త పట్టిసీమ గ్రామపంచాయతీ పరిధిలో ముంపునకు గురైన ప్రాంతాల్లో సరిహద్దుల్లో గోదావరి గట్టుకు ఆనుకుని ఉన్న పల్లపు ప్రాంతాలు నీట మునిగాయి. వర్షపు నీరు బయటకు వెళ్లేందుకు నాలుగు ఇంజన్లను ఏర్పాటు చేసి తరలిస్తున్నారు. జెసిబితో డ్రెయినేజీల పూడికలు తీస్తూ శుభ్రం చేస్తూ వర్షపు నీరు బయటకు వెళ్లేందుకు మార్గాలు చేస్తున్నారు. గ్రామాల్లో బ్లీచింగ్ చల్లడం, డ్రెయినేజీలు, వీధులను శుభ్రం చేయడం వంటి పారిశుధ్య పనులపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నామని కొత్త పట్టిసీమ సర్పంచి విజయదుర్గ తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ తాతి విజయ కుమారి, విఆర్‌ఒ వినయ్ ఉన్నారు.

ముమ్మరంగా వాహనాల తనిఖీ

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

ఎస్‌పి ప్రతాప్ శివ కిషోర్ ఆదేశాల మేరకు నూజివీడు రూరల్ సిఐ కొప్పిశెట్టి రామకృష్ణ, ఎస్ఐ ఆర్.మల్లికార్జునరెడ్డి శనివారం వాహన తనిఖీలు చేశారు. సరైన ధ్రువపత్రాలు లేని వాహనదారులకు చలానాలు విధించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ద్విచక్రవాహనదారులందరూ తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని చెప్పారు. వాహనదారులందరూ వాహనానికి సంబంధించిన అన్ని పత్రాలను సక్రమంగా ఉంచుకోవాలన్నారు.

ముదినేపల్లి : డిఎస్‌పి డి.శ్రావణకుమార్, కైకలూరు రూరల్ సిఐ బి.కృష్ణకుమార్ పర్యవేక్షణలో ముదినేపల్లిలో శనివారం పోలీసులు వాహనాలు తనిఖీ చేపట్టారు. ఎస్ఐ డి.వెంకట్‌కుమార్ తన సిబ్బందితో ముదినేపల్లి సెంటర్‌లో ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేసి ట్రాఫిక్ రూల్స్, కాగితాలు సరిగా లేని వాహనాలకు జరిమానాలు విధించారు.

ఎస్‌సి వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పుపై 17న నిరసన

మాల జాతి యోధుల పోరాట సమితి

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

ఏలూరు జిల్లాలో ఈ నెల 17వ తేదీన ఎస్‌సి వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుపై మాల జాతి యోధుల పోరాట సమితి ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు దళిత నాయకులు తెలిపారు. ఏలూరు నగరంలో జన్మభూమి పార్క్ వద్ద శనివారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో పలువురు దళిత నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మెండెం సంతోష్‌కుమార్ మాట్లాడుతూ సుప్రీంకోర్టు తీర్పు వల్ల ఎస్‌సి వర్గాల్లో ఐకమత్యం కొరవడిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రధానమంత్రి నరేంద్రమోడీ, ముఖ్యమంత్రి చంద్రబాబు నిర్ణయాల వల్ల దేశవ్యాప్తంగా ఎస్‌సి వర్గాల్లో ఆందోళన కలిగిందన్నారు. నేతల రమేష్ మాట్లాడుతూ ఈ నెల 17వ తేదీన తలపెట్టిన నిరసన కార్యక్రమంలో జిల్లాలోని ప్రతి ఇంటి బిడ్డ పాల్గొనాలని పిలుపునిచ్చారు. మత్తే బాబి మాట్లాడుతూ అన్నదమ్ముల్లా ఉండాల్సిన దళితులు నేడు సుప్రీంకోర్టు తీర్పుతో కొట్లాటలో కూరుకుపోతున్నారన్నారు. సుప్రీంకోర్టు తీర్పును సమీక్షించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో అబ్బూరి అనిల్, విజయ్, దళిత నాయకులు పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి

ప్రజాశక్తి - కలిదిండి

అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి చెందిన సంఘటన మండలంలోని సానా రుద్రవరంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సానా రుద్రవరానికి చెందిన పుప్పాల అనంతలక్ష్మి(33) మృతదేహం సమీపంలోని చెరువులో ఉంది. ముఖంపై గాట్లు ఉండడంతో అనుమానించిన మృతురాలి తల్లి ఆదిలక్ష్మి పోలీసులకు ఫిర్యాదు చేసింది. తన అల్లుడు నాగరాజు తన కుమార్తెను కొట్టి చెరువులో ముంచి చంపాడని ఆమె ఫిర్యాదులో పేర్కొంది. మృతురాలికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. నాగరాజును అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరిచినట్లు సిఐ కృష్ణ కుమార్ తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఉపాధ్యాయ సంక్షేమం, సమాజాభివృద్ధికి యుటిఎఫ్ కృషి

ఘనంగా యుటిఎఫ్ స్వర్ణోత్సవ వేడుకలు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

చారిత్రాత్మకవసరంగా ఆగస్టు పదో తేదీ 1974లో ఏర్పడిన ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ శనివారంతో 50 ఏళ్లు పూర్తి చేసుకుని స్వర్ణోత్సవ ఉత్సవాలు జరుపుకునే సందర్భంగా 51 ఆవిర్భావ దినోత్సవ వేడుకలను, పతాకావిష్కరణను ఏలూరు జిల్లాలో అన్ని మండల కేంద్రాల్లో శనివారం ఘనంగా నిర్వహించారు. జిల్లా కేంద్రమైన ఏలూరు యుటిఎఫ్ కార్యాలయంలో



ఆగిరిపల్లిలో...

పతాకావిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. పూర్వపు యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు, టీచర్స్ ఎంఎల్‌సి షేక్ సాబ్జీ సతీమణి ఉపాధ్యాయులు సుభాని బేగం యుటిఎఫ్ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి రవికుమార్ రుద్రాక్షి మాట్లాడుతూ ఉపాధ్యాయులకు పాటల, సాంస్కృతిక పోటీలు నిర్వహిస్తామని, మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిలో డిసెంబర్




ముసునూరులో...

నెల వరకు వివిధ కార్యక్రమాలు, మహాసభలు జరుగుతాయని చెప్పారు. జిల్లా అధ్యక్షులు ముస్తఫా ఆలీ, రాష్ట్ర కార్యదర్శి సుభాషిని మాట్లాడారు. అనంతరం సభ నిర్వహించారు. సభలో అమరజీవులు పూర్వతరం నాయకులకు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కోశాధికారి జివి.రంగమోహన్, జిల్లా కార్యదర్శి నంబూరి రాంబాబు, ఎస్.సుధారాణి, కె.కమల్‌కుమార్, జిల్లా ఆడిట్ కన్వీనర్ బి.మోహన్‌రావు, ఆడిట్ కమిటీ సభ్యులు తేరా ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చింతలపూడి : ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి యుటిఎఫ్ ఎంతగానో కృషి చేస్తుందని యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు ఎంవి.అప్పారావు అన్నారు. చింతలపూడి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో యుటిఎఫ్ స్వర్ణోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రిటైర్డ్ ఉపాధ్యాయులు జె.సూరారెడ్డి, థేరేసమ్మ యుటిఎఫ్ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు పురేటి శ్రీను, శేఖర్, కంచర్ల బుచ్చిబాబు, ప్రేమ్ కుమార్, చార్లెస్, మరీదు శ్రీను పాల్గొన్నారు.

కొయ్యలగూడెం : మండలంలో యుటిఎఫ్ స్వర్ణోత్సవ పతాకావిష్కరణ కార్యక్రమం సొసైటీ భవనం వద్ద నిర్వహించారు. యుటిఎఫ్ మండల శాఖ ప్రధాన కార్యదర్శి



కొయ్యలగూడెంలో...

సరంగుల రమేష్ బాబు ఆధ్వర్యంలో జిల్లా కార్యదర్శి ఆకుమర్తి విక్టర్ యుటిఎఫ్ జెండా ఎగురవేసి యూనియన్ సేవా కార్యక్రమాలు సభ్యులకు వివరించారు. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు బివి.రావు, ట్రెజరర్ మరపట్ల ఈశ్వర్, రాయపూడి వెంకటరమణ, అలెగ్జాండర్, నాగకృష్ణ, పాలేటి శ్రీనివాస్, అనిల్, పాండురంగ, రఫీ, లక్ష్మీప్రసాద్, సుబ్బారావు, వరప్రసాద్ పాల్గొన్నారు.

ముసునూరు : మండలంలోని ముసునూరు సెంటర్‌లో యుటిఎఫ్ సీనియర్ సభ్యులు జిల్లా కౌన్సిలర్ డి.బెనర్జీతో కలిసి పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాధ్యక్షులు జి.వెంకటేశ్వరరావు, జిల్లా ఆడిట్ కమిటీ సభ్యులు కాసాని గాంగేయుడు,



ఏలూరులో..

మండలాధ్యక్షులు జి.పద్మకిషోర్, ప్రధాన కార్యదర్శి ఎ.పుల్లయ్య, సహాధ్యక్షులు జి.రాంబాబు, గౌరవాధ్యక్షులు సిహెచ్.జాకబ్‌రాజు, మండల కార్యదర్శులు ఎన్.విష్ణు, కె.రాజు, కె.విల్సన్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నూజివీడు టౌన్ : నూజివీడు ప్రాంతీయ కార్యాలయంలో పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మండలాధ్యక్షులు బొద్దుకోళ్ల బాబూరావు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మల్లెల చెన్నకేశవరావు, జి.వెంకటేశ్వరరావు, యుటిఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

చాట్రాయి : చాట్రాయిలోని ఎంఆర్‌సిలో యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి పంతగాని వీర కోటి పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి చీదిరాల రఘు, ట్రెజరర్ జిఎస్ఎన్.రెడ్డి, జిల్లా కౌన్సిలర్ రత్తయ్య పాల్గొన్నారు.



చాట్రాయిలో...

ఆగిరిపల్లి : ఆగిరిపల్లి యుటిఎఫ్ కార్యాలయం వద్ద సీనియర్ సభ్యులు, మాజీ గౌరవ అధ్యక్షులు బి.జీవరత్నం, ప్రభావతి దంపతులు పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి కె.అజరయ్య, జిల్లా కార్యవర్గ సభ్యులు జె.జ్ఞానసుందరం, సీనియర్ సభ్యులు పి.రాంగోపాల్, జి.వెంకట్రావు, సిపిఎం నాయకులు ఎస్.కోటేశ్వరరావు, జహంగీర్ బాషా పాల్గొన్నారు.



ముసునూరులో...

ఉపాధి హామీలో అవకతవకలపై చర్యలు తీసుకోవాలి

వ్యవసాయ కార్మిక సంఘం

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం టౌన్

మండలంలో ఉపాధి హామీ చట్టంలో జరుగుతున్న అవకతవకలపై విచారణ జరిపి బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి అందుగుల ప్రభాకరరావు డిమాండ్ చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం మండల కమిటీ సమావేశం మండలాధ్యక్షురాలు యాగంటి సీత అధ్యక్షతన స్థానిక ప్రజాసంఘాల కార్యాలయంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.జీవరత్నం, మండల కార్యదర్శి అందుగుల ప్రభాకరరావు మాట్లాడుతూ ఉపాధి హామీ పనుల్లో జరుగుతున్న అవకతవకలపై సమగ్ర దర్యాప్తు, విచారణ జరిపి అవినీతిని అరికట్టాలని కోరారు. ఉపాధి హామీ కూలీల సమస్యలు పరిష్కరించాలన్నారు. ఈ సమావేశంలో కమిటీ సభ్యులు జోడే సూర్యచంద్రరావు, పిల్లి చంటి, కె.సుబ్బారావు, వామిశెట్టి నరసరావు, కలపాల వెంకటేష్, నిట్ట నాగరాజు, బొబ్బిలి గంగరాజు పాల్గొన్నారు.

'మానవత' సన్నాహక సమావేశం

ప్రజాశక్తి - ముదినేపల్లి

ముదినేపల్లి మండలంలో మానవతా స్వచ్ఛంద సంస్థ సన్నాహక సమావేశం ముదినేపల్లి ఎస్‌పిఎంఎం కళాశాల ప్రాంగణంలో శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమం ఉమ్మడి కృష్ణా జిల్లా సమన్వయకర్త అడుసుమిల్లి నిర్మల అధ్యక్షతన ఉమ్మడి కృష్ణాజిల్లా కెరీర్ గైడెన్స్ ఛైర్మన్ డాక్టర్ సుదాబత్తుల విజయ్‌కుమార్, ఏలూరు మానవతా శాఖ కార్యదర్శి వల్లూరుపల్లి సాయి సుధా ప్రత్యేక అతిథులుగా కొనసాగింది. ఈ సందర్భంగా వక్తలు మానవతా సంస్థ ఆశయాలు, విజయాలు వాటి వల్ల జరిగే సేవా కార్యక్రమాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ముదినేపల్లి ప్రముఖులు డాక్టర్ మనోజ్, ఐటిఐ కాలేజీ ప్రిన్సిపల్ కూనపరెడ్డి సత్యనారాయణ, నిమ్మగడ్డ రవి, సాక్షి సాయిబాబు, దూసనపూడి దాసు, సూదాబత్తుల రమణ, అడుసుమిల్లి అప్పారావు, గుడివాడ గణేష్, తలారి గోపాలకృష్ణ పాల్గొన్నారు

1 నుంచి ఎఐటియుసి జాతీయ సమ్మేళనం

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

వచ్చే నెల 1,2,3 తేదీల్లో వైజాగ్‌లో జరుగుతున్న ఎఐటియుసి జాతీయ సమితి సమ్మేళనాలను ఉద్యోగ కార్మికులు జయప్రదం చేయాలని ఎఐటియుసి ఏలూరు ఏరియా కార్యదర్శి ఎ.అప్పలరాజు కార్మిక వర్గానికి పిలుపునిచ్చారు. స్థానిక కోటదిబ్బ ఎస్ఆర్ వన్ వద్ద వైజాగ్‌లో జరుగుతున్న ఎఐటియుసి జాతీయ సమితి సమ్మేళనాల వాల్‌పోస్టర్‌ను ది జోనల్ మున్సిపల్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు, కార్యకర్తలు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో, ట్యాప్ ఇన్‌స్పెక్టర్ సిహెచ్.హరినాథబాబు, బి.దుర్గారావు, యూనియన్ నాయకులు ఎస్ఎంవి సుబ్బారావు, డి.వెంకటేష్ ఎం.సయ్యద్‌బాజీ పాల్గొన్నారు.

సర్పంచులకు, కార్యదర్శులకు ముగిసిన శిక్షణా తరగతులు


ప్రజాశక్తి - ముసునూరు

ప్రతి గ్రామంలోని చెత్త సంపద కేంద్రాలను ఆ గ్రామ పంచాయతీకి ఆర్థిక వనరుగా మలుచుకోవాలని మండల అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ కూచిపూడి సాయిరాం అన్నారు. మండల కేంద్రమైన ముసునూరు మండల పరిషత్ కార్యాలయంలో మండలంలోని 16 గ్రామాల గ్రామ సర్పంచులకు, పంచాయతీ కార్యదర్శులకు రెండు రోజుల శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో ముగింపు రోజు శనివారం శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా సాయిరాం మాట్లాడుతూ అన్ని గ్రామాల్లో పారిశుధ్యం, డ్రెయినేజీ, పలు అభివృద్ధి కార్యక్రమాలపై సర్పంచులు అందరూ దృష్టి సారించాలన్నారు. అభివృద్ధి వైపు ముందుకు నడవాలని చెప్పరు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, కార్యదర్శులు, సర్పంచులు పాల్గొన్నారు.

రైతుల పక్షపాతి టిడిపి కూటమి ప్రభుత్వం

ఉంగుటూరు ఎంఎల్‌ఎ పత్సమట్ల ధర్మరాజు

ప్రజాశక్తి - నిడమర్రు



రైతులతో మాట్లాడుతున్న ఎంఎల్‌ఎ ధర్మరాజు

టిడిపి కూటమి ప్రభుత్వం రైతుల పక్షపాతి అని ఉంగుటూరు ఎంఎల్‌ఎ పత్సమట్ల ధర్మరాజు అన్నారు. మండలంలోని భువనపల్లి గ్రామ రైతు భరోసా కేంద్రం వద్ద ఇటీవల కురిసిన వర్షాల కారణంగా నారుమడులు నష్టపోయిన రైతులను ఆదుకోవాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం 80 శాతం రాయితీపై పంపిణీ చేసే విత్తనాలను మండల రైతులకు ఎంఎల్‌ఎ ధర్మరాజు చేతులమీదుగా అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల కురిసిన వర్షాలకు రైతులు నష్టపోయారని, వారికి అండగా ఉండాలనే ఉద్దేశంతో వరి విత్తనాలను 80 శాతం రాయితీపై రాష్ట్ర ప్రభుత్వమే పంపిణీ చేస్తుందన్నారు. ఈ మేరకు రైతులందరూ రాయితీపై అందించే విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గత ప్రభుత్వం వ్యవసాయ రంగంపై నిర్లక్ష్య ధోరణి ప్రదర్శించటంతో రైతులు చాలా ఇబ్బందులు పడ్డారన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి, జనసేన నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

కల్వర్టు పనులు వేగవంతం చేయాలి

ఎంపిపి గంజిమాల రామారావు

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

ఇటీవల కురిసిన భారీ వర్షాలకు గండి కొట్టిన కల్వర్టు పనులు వేగవంతం చేసి ప్రజల రాకపోకలకు అంతరాయం లేకుండా చూడాలని కొయ్యలగూడెం ఎంపిపి గంజిమాల రామారావు చెప్పారు. మండలంలోని కన్నాపురం గ్రామంలో తూర్పు కాలువపైన ఎర్రాయిగూడెం గ్రామం వెళ్లే రోడ్డులో, ఎస్‌సి కాలనీ శ్మశానవాటిక రోడ్డు గండ్లు పడిన విషయం కన్నాపురం ఎంపిటిసి సభ్యులు ఆదివారం నిర్వహించిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా ఎంపిపి రామారావు మాట్లాడుతూ తాత్కాలిక మరమ్మతుల పనులు నిమిత్తం రూ.మూడు లక్షల పనులకు అనుమితిచ్చారు. ఇందుకు సంబంధించిన పనులను శనివారం ఎంపిపి గంజిమాల రామారావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు ఇబ్బంది కలుగకుండా పనులు త్వరితగతిన పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కి చెప్పారు. ఈ కార్యక్రమంలో కన్నాపురం ఎంపిటిసి సభ్యులు షేక్ బాజీ, కాగితాల గణపతిరావు, బొడిగూడెం ఎంపిటిసి సభ్యులు కింగ్ జాన్ డేవిడ్, పరింపూడి ఎంపిటిసి సభ్యురాలి భర్త గంటా సాయి పాల్గొన్నారు.

ఐటిడిఎ సౌకర్యాలు నాయకపోడులకు అందించాలి

ఆదివాసీ నాయకపోడు కమిటీ, ఎంప్లాయీస్ యూనియన్

ప్రజాశక్తి - టి.నరసాపురం



ఆదివాసీ దినోత్సవ వేడుకలు

ఐటిడిఎ ద్వారా ప్రభుత్వం అందిస్తున్న అన్ని సౌకర్యాలు నాయకపోడులకు కూడా అందించాలని ఆదివాసీ నాయకపోడు కమిటీ జిల్లా అధ్యక్షులు నారం రాజా, ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు అప్పిరెడ్డి రాము, రాష్ట్ర ఉపాధ్యక్షులు కాసిన లక్ష్మీనారాయణ అన్నారు. మండలంలోని కొల్లివారిగూడెంలో ఆదివాసీ నాయకపోడు కమిటీ ఆధ్వర్యంలో ఆదివాసీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నారం రాజా ఆదివాసీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం కొమురం భీం, మద్ది రాంచందర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాయకపోడుల హక్కుల సాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. వర్గీకరణలో భాగంగా ప్రభుత్వాలు ఎస్‌టి వర్గీకరణ చేపడితే నాయకపోడులకు రిజర్వేషన్‌లో ప్రత్యేక స్థానం కల్పించాలని డిమాండ్ చేశారు. నాయకపోడులు అన్ని రంగాల్లో రాణించి అభ్యున్నతి సాధించాలన్నారు. ఏ దేశమేగినా ఎందుకాలిడినా పొగడరా నీజాతి నిండు గౌరవము అన్న చందంగా నాయకపోడులు ముందుకు సాగాలన్నారు. ఆదివాసీల త్యాగాలకు గుర్తుగా ఆదివాసీ దినోత్సవాన్ని జరుపుకుంటున్నామన్నారు. స్థానికంగా ఏర్పాటు చేసిన కొమురం భీం, మద్దరాంచందర్ విగ్రహాలకు షెడ్డు ఏర్పాటు చేసిన గ్రామపెద్దలకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ నాయకపోడు కమిటీ జిల్లా సెక్రటరీ కేసర వెంకటేశ్వరరావు, మండలాధ్యక్షులు సోమిన బుచ్చిరాజు, బేతం హనుమంతరావు, పెద్దలు రెడ్డి శ్రీనివాసరావు, ఎన్.బాలరాజు, మహిళలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆదమరిస్తే అంతే..!

ప్రమాదకరంగా ధ్వంసమైన కల్వర్టు
భయాందోళనలో వాహనదారులు, ప్రయాణికులు

ప్రజాశక్తి - జీలుగుమిల్లి



ప్రమాదకరంగా ఉన్న ధ్వంసమైన కల్వర్టు

ఏజెన్సీ ప్రాంతాల్లో ఇటీవల కురిసిన వర్షాలకు పలు చోట్ల కల్వర్టులు కొట్టుకుపోయాయి. మండలంలోని వంకవారిగూడెం గ్రామానికి వెళ్లే రహదారిపై ఉన్న కల్వర్టు పూర్తిగా ధ్వంసమై అధ్వానంగా తయారైంది. దీంతో ప్రయాణం చేసేటప్పుడు ఆదమరిస్తే వాగులో పడిపోయే ప్రమాదం ఉంది. వంకవారిగూడెం, మడకంవారిగూడెం, వాడపల్లి, నిర్వాసిత కాలనీకి వెళ్లేందుకు ఇదే ప్రధాన రహదారి. ఈ రహదారి గుండా భయంతో బిక్కు బిక్కుమంటూ వెళ్లాల్సి వస్తుందని వాహనదారులు, ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాత్రి సమయంలో అయితే మరింత ప్రమాదకరంగా ఉంటుందని భయభ్రాంతులకు గురవుతున్నారు. అధికారుల స్పందించి కల్వర్టు నిర్మాణం చేపట్టాలని పలు గ్రామాల వాసులు ముక్తకంఠంతో కోరుతున్నారు.

సర్ సిఆర్.రెడ్డి కళాశాలలో 14న క్యాంపస్ డ్రైవ్

జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి సుధాకర్

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఇంటర్మీడియట్ బోర్డు హెచ్‌సిఎల్ టెక్నాలజీస్ లిమిటెడ్ సంయుక్త ఆధ్వర్యంలో హెచ్‌సిఎల్ టెక్ బి కెరీర్ ప్రోగ్రాం ద్వారా ఉద్యోగావకాశాలు కల్పించడంలో భాగంగా ఈ నెల 14వ తేదీ సర్‌సిఆర్ రెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో క్యాంపస్ డ్రైవ్ నిర్వహించనున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి గంటా సుధాకర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు తమ తల్లి లేదా తండ్రితో హాజరు కావాలని ఆయన తెలిపారు. సిఇసి, హెచ్‌ఇసి, బైపిసి, వృత్తి విద్యలలో ఇంటర్ పూర్తి చేసిన వారికి భారతదేశపు అతిపెద్ద ఐటి కంపెనీలో ఒకటైన హెచ్‌సిఎల్‌తో అనుబంధం పొందడానికి ఇది ఉత్తమ అవకాశమన్నారు. 2023-2024 ఇంటర్‌లో 75 శాతం కంటే ఎక్కువ మార్కులు ఉన్న అభ్యర్థులు ఈ ప్రోగ్రాంకి అర్హులని, నమోదు చేసుకున్న అభ్యర్థులకు కెరీర్ ఆప్టిట్యూడ్ టెస్ట్, అదే రోజు హెచ్‌ఆర్ ఇంటర్వ్యూ ఉంటుందని తెలిపారు. ఇంటర్వ్యూలో కూడా ఎంపికైన అభ్యర్థులు హెచ్‌సిఎల్ నుంచి ఆఫర్ లెటర్‌ని పొందుతారని, అనంతరం రూ.51 వేలు రుసుము శిక్షణ నిమిత్తం చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. ఈ టెక్ బి ట్రైనింగ్ ప్రోగ్రాం కాల పరిమితి ఒక ఏడాది ఉంటుందని, మొదటి మూడు నెలలు క్లాస్ రూమ్ ట్రైనింగ్ మదురైలో ఉంటుందని, చివరి తొమ్మిది నెలలు అభ్యర్థి ఇంటర్న్‌షిప్ కోసం చెన్నై క్యాంపస్‌కి వెళ్లాల్సి ఉంటుందన్నారు. ఇంటర్న్‌షిప్ సమయంలో అభ్యర్థికి నెలకు రూ.పది వేల చొప్పున స్టయ్‌ఫండ్ అందించనున్నట్లు తెలిపారు. ట్రైనింగ్‌ని విజయవంతంగా పూర్తి చేసిన అభ్యర్థి ఉద్యోగిగా మారిన అనంతరం సంవత్సరానికి రూ.1.70 లక్షలు పొందవచ్చున్నారు. అభ్యర్థులు ఇంటర్మీడియట్ అర్హతతో మిగిలిపోకుండా హెచ్‌సిఎల్ వారు అభ్యర్థుల ఉన్నత విద్యలో సహకారం అందిస్తారని, వివిధ విశ్వవిద్యాలయాల ద్వారా అభ్యర్థులు ఉన్నత విద్యను పొందవచ్చని చెప్పారు. ఈ అవకాశాన్ని అర్హత కలిగిన ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని, వివరాలకు 9666322032, 9652503799 సంప్రదించాలని తెలిపారు.

విజేతలకు బహుమతుల ప్రదానం

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

స్థానిక పవర్‌పేటలోని హిందీ నికేతన్ వజ్రోత్సవాల్లో భాగంగా శనివారం 5, 6, 7 తరగతుల విద్యార్థులకు హిందీ భాషా లేఖన పోటీలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేసినట్లు హిందీ నికేతన్ కార్యదర్శి పి.కవితాకుమారి తెలిపారు. హిందీ నికేతన్ అధ్యక్షులు వి.వెంకటస్వామి మాట్లాడుతూ వినడం, చదవడం, రాయడం, మాట్లాడటం ఈ నాలుగింటినీ భాషా కౌశలాలంటారన్నారు. నేడు విద్యార్థులు భాషను రాయడంలో అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారన్నారు. అందుకే ప్రతిరోజు భాషా లేఖన అభ్యాసం చేయించాల్సిన అవసరం ఉందన్నారు. భాషా లేఖనం వల్ల విద్యార్థుల్లో పదాలను విని అర్థం చేసుకుని రాసే సామర్థ్యం పెరుగుతుందని, భాషలోని విరామం, అర్థవిరామం వంటివి అలవాటవడంతో పాటుగా అక్షరాలను అందంగా రాయటం అలవాటు చేసుకుంటారన్నారు. రిటైర్డ్ అసోసియేట్ ప్రొఫెసర్ లేళ్ల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ 1950లో కీర్తిశేషులు పిన్నింటి సత్యనారాయణచే స్థాపించిన హిందీ నికేతన్ సంస్థ నేటికీ హిందీ సేవ చేయడం ముదావహమని, విద్యార్థుల్లో భాషా కౌశలాలను పెంపొందించేందుకు విభిన్న కార్యక్రమాలు చేపడుతున్నారని, వాటిని విద్యార్థులు సద్వినియోగం చేసుకొని హిందీ భాషా నైపుణ్యాలను పెంచుకోవాలని సూచించారు. ఇదే సందర్భంలో ప్రముఖ హిందీ కవి తులసీదాస్ జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళు లర్పించారు. హిందీ పండిత శిక్షణ కళాశాల లెక్చరర్ పిఎం.మోహన్‌కుమార్ తులసీదాసు గొప్పతనం గురించి విద్యార్థులకు వివరించారు. రామచరిత మానస్ అనే ప్రబంధ కావ్యం ద్వారా తులసీదాసు ప్రపంచ ప్రసిద్ధిగాంచారని, లోక కళ్యాణార్థం చేసిన ఈ రచన ఆయనకు వారణాసిలో గుడి నిర్మించేంత ఖ్యాతిని తెచ్చి పెట్టిందని చెప్పారు. మొత్తం 61 మంది పాల్గొన్న ఈ లేఖన పోటీలో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను వరుసగా కె.భువన, సిహెచ్.తాన్య, ఎండి ఆర్వాజ్ ఖాన్ పొందగా ప్రోత్సాహక బహుమతులను బి.నిశాల్‌వర్మ, పి.పూజిత పొందారు. ఈ కార్యక్రమంలో హిందీ పండితులు, విద్యార్థులు పాల్గొన్నారు.